సాక్షి
సిద్దిపేట

సోమవారం। 20। మే। 2024

## న్యూస్‌రీల్

### అకాల వర్షం.. తడిసిన ధాన్యం



జగదేవ్‌పూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతు దిగాలు

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** అకాల వర్షాల వల్ల రైతుల పాట్లు అన్నీఇన్నీకావు. ఆదివారం కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. జగదేవ్‌పూర్‌లోని కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కోరుతున్నారు.

### టెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** టెట్ నిర్వహణకు జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీ పొన్నాల, వెర్టాన్ ఇనిస్టిట్యూట్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ఈనెల 20 నుంచి జూన్ 03 వరకు జరుగుతాయన్నారు. రెండుసెషన్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు.

### నేటి యువతకు స్ఫూర్తి 'పుచ్చలపల్లి'

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎల్లయ్య**



గజ్వేల్‌లో పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**గజ్వేల్‌రూరల్:** నిరాడంబరత ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపిన పుచ్చలపల్లి సుందరయ్య నేటి యువతకు స్ఫూర్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా పనిచేసిన పుచ్చలపల్లి సుందరయ్య కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధిడిగా ఉద్యమాలను నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, బండ్ల స్వామి, కనకయ్య, వెంకటచారి, ఐలయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

**ఆశయాలు కొనసాగించాలి..**

**మిరుదొడ్డి(దుబ్బాక):** స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి అన్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రాల్లో ఆదివారం వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనికి తగిన వేతనం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. సీఐటీయూ, సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

### ఏసయ్య.. కరుణించు



భక్తుల ప్రత్యేక ప్రార్థనలు

**మెదక్‌జోన్:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు పర్యాయాలు ఆరాధనలు నిర్వహించారు. మత గురువులు జీడియన్, రెవరెండ్ రూబెన్ మార్క్ దైవసందేశం ఇచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# పోచమ్మకు బోనం.. ఊరంతా సంబురం



అనంతగిరిపల్లిలో బోనాల ఊరేగింపు

**వర్గల్(గజ్వేల్):** అనంతగిరిపల్లి బోనమెత్తింది. దీపాలతో కూడిన బోనాలతో ఊరూవాడా కదిలింది. ఆదివారం వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో పోచమ్మ దేవత బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. కులాలకు అతీతంగా ఊరి జనమంతా ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. శివసత్తుల విన్యాసాల నడుమ బోనాల ఊరేగింపు కొనసాగింది. పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మోరుకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పల్లెజనం ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# అశ్రద్ధే పురంపర!

**పన్నుల వసూలు అరకొర**

- రాబడిపై దృష్టి సారించని అధికారులు
- వ్యాపార సముదాయాలకు పన్ను పెంపుపై రెండేళ్ల క్రితమే ఆదేశాలు
- అయినా అమలు చేయడంలో ఆలస్యం
- మున్సిపాలిటీల్లో దుస్థితి

**జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆదాయ మదింపు ప్రక్రియ సక్రమంగా సాగడం లేదు. పెరిగిన లెక్కల ప్రకారం వ్యాపార సముదాయాలకు, బహుళ అంతస్తులకు పన్నును సైతం పెంచాలని రెండేళ్ల క్రితం నుంచే ఆదేశాలున్నా అది అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మున్సిపాలిటీలకు రావాల్సిన రాబడి ఆశించినంతగా పెరగటం లేదనే విమర్శలున్నాయి.**

– గజ్వేల్




గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

జిల్లాలో సిద్దిపేటతోపాటు గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో సిద్దిపేట ఏటా రూ.18కోట్లకుపైగా ఆదాయంతో అగ్రస్థానంలో ఉన్నది. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రూ.4.3కోట్లతో రెండోస్థానంలో ఉండగా.. మిగతా మున్సిపాలిటీలు రూ.2–3కోట్లలోపు ఆదాయంతో తర్వాత స్థానాలను ఆక్రమిస్తున్నాయి. మున్సిపాలిటీల్లో చాలా కాలంగా పాత పన్నుల విధానామే కొనసాగుతున్నది. రెండేళ్లక్రితం ప్రభుత్వం మున్సిపాలిటీల్లో పెరిగిన లెక్కల ప్రకారం వ్యాపార సముదాయాలు, బహుళ అంతస్తుల ఆస్తి పన్నులను పెంచాలని ఆదేశాలిచ్చింది. కానీ ఈ ఆదేశాలు సక్రమంగా అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యాపార, బహుళ సముదాయాలకు పెరిగిన లెక్కల ప్రకారం పన్ను పెంచి ఉంటే గజ్వేల్ మున్సిపాలిటీ ఆదాయం ఇంకా పెరిగి ఉండేది. కానీ గతేడాది ఇది జరగలేదు. ఫలితంగా ఆదాయం పెరుగుదల కనిపించలేదు. ఎట్టకేలకు ఇటీవల ఇక్కడి అధికారులు ఆదాయం పెంపునకు రంగంలోకి దిగారు. ఆదాయం పెంచడానికి అవకాశమున్నా...సముదాయాలపై దృష్టి పెట్టారు. కొద్ది రోజుల్లోనే రూ.13లక్షలకుపైగా పన్ను పెంచగలిగారు. ఇదంతా నిబంధనల ప్రకారమే చేపట్టారు. ఇందులో మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాల భవనానికి ఏకంగా ఏడాదికి రూ.3లక్షల పన్ను విధించారు. మరో ప్రైవేటు ఆస్పత్రి భవనానికి రూ.2లక్షలకుపైగా కొత్త పన్ను విధించారు. గతంలో పనిచేసిన అధికారులు ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయడం వల్ల మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం రాకుండా పోయిందని తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఆదాయం రాబట్టే పనిపై దృష్టి పెట్టడం మంచి ఫలితాలనిస్తున్నది. ఈ ఒక్క మున్సిపాలిటీలోనే కాదు.. దాదాపు అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. మున్సిపాలిటీల అభివృద్ధికి దోహదకారిగా నిలిచే ఆదాయ మదింపుపై అధికారులు నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## నిబంధనలు బేఖాతర్

ఇకపోతే పన్నుల తగ్గింపులోనూ అధికారులు నిబంధనలు పాటించడం లేదని విమర్శలు కూడా వస్తున్నాయి. 2023–24 ఏడాదిలో ఇలాంటి సంఘటనలు అన్ని మున్సిపాలిటీల్లో చోటుచేసుకున్నాయనే ఆరోపణలున్నాయి. పన్నుల వసూలు లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలనే ఆరాటామా? ఇతర కారణాలో తెలియదు కానీ కొందరికి హడావిడిగా పన్నులు తగ్గించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ కారణాలతో ప్రాపర్టీ టాక్స్ తగ్గించాలని ఆయా మున్సిపాలిటీల్లో ఎంతోమంది దరఖాస్తు పెట్టుకున్నారు. దరఖాస్తులను స్వీకరించిన అధికారులు.. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. ఆ తర్వాత పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్ మొత్తం రికవరీ చేయాలి. ఆపై ట్యాక్స్ తగ్గింపునకు సంబంధించిన ప్రక్రియను చేపట్టాలి. దీనికి తగినంత సమయం కూడా తీసుకోవాలి. కానీ అందుకు భిన్నంగా హడావిడిగా ఆ పన్నులను అధికారులు తగ్గించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ ఆదాయం తగ్గించే పనిని ఒకటికి వందసార్లు ఆలోచించి చేయాల్సిన అధికారులు హడావిడిగా పూర్తి చేయడమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అంశంపై ఆయా మున్సిపాలిటీల్లో లోతైన విచారణ జరిగితే ఎన్నో వాస్తవాలు బయటపడే అవకాశముంది.

# నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్

- రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా
- సిద్దిపేట సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

**సిద్దిపేటకమాన్:** జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టామని సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సీపీ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ విత్తన అక్రమార్కులపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉంటారన్నారు. వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృందాలు రైతులను మోసం చేసే, నకిలీ విత్తనాల సరఫరా చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాయన్నారు. గతంలో కేసులు నమోదైన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అనుమతి పొందిన సంస్థల విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అనుమానం వస్తే శాంపిల్స్‌ను పరీక్షలకు పంపిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు రవాణ జరగకుండా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాల అమ్మకాలు, సరఫరాను అరికట్టేందుకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేశామని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని సీపీ హెచ్చరించారు.

# ఇన్సెంటివ్ డబ్బులు చెల్లించండి



మాట్లాడుతున్న పట్టు రైతుల సహకార సంఘం అధ్యక్షుడు ఐలయ్య

**సిద్దిపేటకమాన్:** పట్టు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాన్ని చెల్లించాలని పట్టు రైతుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్సెంటివ్ బకాయిలు సైతం ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. మార్కెట్లో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టుగూళ్ల విక్రయ కేంద్రంలో కనీస వసతులు లేవని, మార్కెట్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టుగూళ్ళను మార్కెట్లో విక్రయించిన రోజే ఇన్సెంటివ్ రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టు రైతుల సహకార సంఘం కోశాధికారి రాగుల రాజు, జిల్లా కమిటీ సభ్యులు పెద్దోళ్ల నర్సింహులు, రేగుల దేవయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కాశీవిశ్వనాథస్వామి ఉత్సవాలు



శివపార్వతుల కల్యాణోత్సవంలో భక్తులు..

**దుబ్బాక:** పట్టణంలో కాశీవిశ్వనాథ స్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామునే వేదపండితుడు సిద్ధిరాములు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు.

# కేతకీలో జడ్జి పూజలు



జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

**ఝరాసంగం(జహీరాబాద్):** కేతకీ సంగమేశ్వర ఆలయంలో నారాయణఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన వారికి పూర్ణకుంభంతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో పాదప్రక్షాళన చేసి, పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, శాలువాతో సన్మానించారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



మర్కూక్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

**మర్కూక్(గజ్వేల్):** ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మర్కూక్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకున్న పాపన లేదన్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, దీంతో అకాల వర్షాలకు తడిసి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న, దొడ్డు రకం వడ్లకు ప్రభుత్వం వెంటనే రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా గే కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు మంగమ్మ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.





# మల్లన్న క్షేత్రం.. భక్తజనసంద్రం

గంగిరేణు చెట్టు ప్రాంగణంలో భక్తజనం (ఇన్‌సెట్) పట్నాలు వేస్తున్న భక్తులు

కొమురవెల్లి మల్లన్న ఆలయం భక్తజన సంద్రమైంది. భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. స్వామి వారికి అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేకపూజలు చేశారు. గంగిరేణు చెట్టువద్ద ముడుపులు కట్టారు. కొంత మంది భక్తులు కొండ పైన రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ, ప్రధానార్చకులు పర్యవేక్షించారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)





# నాచగిరి.. ఆధ్యాత్మిక సిరి

నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాద్, సికింద్రాబాద్ , ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు హల్దీనది వాగులో పుణ్యస్నానాలాచరించారు. గుహలో స్వయంభువుగా కొలువైన లక్ష్మీనృసింహునికి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. క్షేత్రాన్ని దాదాపు 6,000 మంది భక్తులు సందర్శించారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

– వర్గల్(గజ్వేల్)

నాచగిరీశుని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్) వ్రతమాచరిస్తున్న దంపతులు

## క్లుప్తంగా

### రోజూ 15 గంటలు చదివాను

**టీఎస్ఎప్‌సెట్ ర్యాంకర్ హుండెకర్ విధిత్**



**జహీరాబాద్ టౌన్:** రోజూ 15 గంటల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టానని టీఎస్ఎప్‌సెట్ ఇంజినీరింగ్‌లో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకర్ హుండెకర్ విధిత్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మాది జహీరాబాద్ మండలం మల్‌చెల్మ గ్రామం. నాన్న అనిల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అమ్మ మమత ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు జహీరాబాద్‌లో చదివాను. ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని నారాయణ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించాను. నాన్నలాగే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని కష్టపడి చదువుతున్నాను. పరీక్షల కోసం రోజూ 15 గంటల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టాను. సమయం వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవాను. ఒత్తిడి లేకుండా చదవటం అలవాటు చేసుకున్నాను. ప్రిపరేషన్.. ఫోకస్ అంతా పరీక్షలపై పెట్టా. తల్లిదండ్రులు కూడా సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి సబ్జెక్టునూ ప్రణాళిక ప్రకారం చదివాను. కాలేజీలో నిర్వహించే టెస్టుల్లో టాపర్‌గా ఉన్నాను. దీంతో పరీక్షల సమయంలో కాన్ఫిడెంట్‌గా ఉన్నా. జేఈఈ మెయిన్స్‌లో కూడా ఆలిండియా ర్యాంక్ వచ్చింది. మొదటిసారి నిర్వహించిన పరీక్షలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రాగా రెండోసారి 5వ ర్యాంక్ వచ్చింది. ముంబయి ఐఐటీలో సీఎస్‌సీ చదవాలనుకుంటున్నా. విదిత్‌ను జహీరాబాద్ వీరశైవలింగాయత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు పి.నాగేశ్వర్ రావు, విజయ్ కుమార్ శెట్టిలు అభినందనలు తెలిపారు.

### ఉత్సవాలు ప్రారంభం

**నారాయణఖేడ్:** భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని తుర్కపల్లి శివారులో కొలువై ఉన్న అమ్మవారికి పూజ, నైవేద్యాల సమర్పణ, బండ్ల ఊరేగింపు, బోనాలు ఊరేగింపు, భజనలు, కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో గొర్రెల మృత్యువాత



మృత్యువాత పడిన గొర్రెలు

**మద్దూరు(హుస్నాబాద్):** కుక్కల దాడిలో గొర్రెలు, ఒక మేక మృతిచెందింది. ఈ ఘటన లద్నూరులో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాగుల బాల్‌నర్సయ్య రోజూ మాదిరిగానే శనివారం రాత్రి గొర్రెల మందను తన వ్యవసాయ బావి వద్దకు తోలాడు. కాగా ఈ మందపై కుక్కలు దాడి చేయగా 9 గొర్రెలు, మేక మృత్యువాత పడ్డాయి. రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తరఫున అధికారులు ఆదుకోవాలని నర్సయ్య వేడుకున్నాడు.

### డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

**వ్యక్తికి గాయాలు**

**కొండపాక(గజ్వేల్):** బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ప్రతాప్ హుస్నాబాద్ మండలం మిర్జాపూర్‌లో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వచ్చాడు. ఆదివారం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి కింద పడ్డాడు. దీంతో తలకు గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది మహేందర్, రమేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


సాక్షి క్లాసిఫైడ్స్

**WANTED**

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]


■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185083]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వగలరని మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


నకిలీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు, ఎరువుల అమ్మకాలపై జిల్లాలోని స్క్వాడ్ బృందాలు నిఘా పెట్టాయి. అనలే వానాకాలం సీజన్ ఫైగా కల్తీ చేసే అవకాశం ఉంది. దీంతో బహిరంగ మార్కెట్లో ప్రవేశించే పెస్టిసైడ్స్ కంపెనీల క్రయవిక్రయాలను పరిశీలిస్తారు. ఇక జిల్లా పరిధిలో రైతులు నకిలీల బారిన పడి నష్టపోకుండా చర్యలు చేపడుతున్నారు. లైసెన్స్ దుకాణాల్లో కొనాలని సూచిస్తున్నారు. ఫైగా వ్యవసాయాధికారులతో కలిసి ఏడీఏ స్థాయి అధికారులు విత్తన మాఫియాను అరికట్టేందుకు అవసరమైన ప్రణాళికలతో సిద్ధమవుతున్నారు. తోక జాడిస్తే కత్తిరించేందుకు పీడీ యాక్ట్ కేసులు సైతం నమోదు చేయనున్నారు.

# నకిలీపై నిఘా



- విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల విక్రయాల పరిశీలన
- జిల్లావ్యాప్తంగా ఆరు బృందాల సారథ్యం
- వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు నమోదుకు రంగం సిద్ధం

**కొండాపూర్(సంగారెడ్డి):** సంగారెడ్డి జిల్లాలో ఈ సంవత్సరం సుమారు 3.60 లక్షల ఎకరాలలో రైతులు పత్తిని సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. కాగా విత్తనాలు అవసరం ఉంది. కానీ మార్కెట్‌లోకి రోజు ఒక కొత్త కంపెనీ విత్తనాలు పుట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాయి. వారు చెప్పే మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొని నష్టపోతున్నారు. విత్తన మాఫియా ఏమో లక్షలు గడిస్తుంది. జిల్లాలో గతేడాది అందిన సమాచారం మేరకు లెక్కకు మించి ఎరువులు నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న అధికారులు.. గోదాంలపై దాడులు చేసి కేసులు నమోదు చేశారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలో ఒక కేసు నమోదైంది. సదాశివపేట పరిధిలోని ఆత్మకూరులో మరో కేసు నమోదైంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారులు కల్తీ, నకిలీలను అరికట్టేందుకు జిల్లాలో ఆరు స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీంలో ఏడీఏలు వేరే డివిజన్ పరిధిలో గల మండలాలకు వెళ్లి స్థానిక ఏఓ, ఏఈఓల సహకారంతో విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తారు. ఈ చర్యల వల్ల రైతుల్లో ఆందోళన తొలుగుతుందని తెలుస్తోంది. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని నమ్మకం కూడా కలుగుతుందని పలువురు రైతులు అంటున్నారు.



రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను కేవలం లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే కొనాలని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తున్నారు. సంబంధిత డీలర్ వద్ద

#### లైసెన్స్ ఉన్న షాపులోనే

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్న సమయంలో తప్పనిసరిగా రశీదును తీసుకోవాలని సూచిస్తున్నారు. రశీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

#### కల్తీలను ఉపేక్షించం

నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను విక్రయించే వారిని ఉపేక్షించేది లేదు. రైతులను మోసం చేస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం. నకిలీలను అరికట్టేందుకు జిల్లాలో ఆరు టీంలను ఏర్పాటు చేశాం. రైతులు ప్రభుత్వ లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, మందులను, ఎరువులను కొనాలి. ఎవరైనా వ్యాపారులు తక్కువ ధరకే విత్తనాలు అమ్ముతామని గ్రామాల్లోకొస్తే తక్షణమే సమాచారం అందించాలి.

నర్సింగరావు, జిల్లా వ్యవసాయాధికారి

# పేదరికాన్ని జయించి.. ప్రభుత్వ కొలువులు సాధించి..

## ఓ హమాలీ కుటుంబ విజయగాథ

- ముగ్గురు పిల్లలకు గవర్నమెంట్ జాబ్స్
- హుస్నాబాద్ పట్టణ యువతకు స్ఫూర్తిదాయకం

**పేదరికం.. చదువుకు అడ్డుకాదని నిరూపించారు. విద్యే ఆయుధంగా చేసుకొని జీవితంపై పోరాడారు. చదువులు పూర్తయిన వెంటనే పోటీ పరీక్షలకు సిద్ధమై ముగ్గురు కూడా.. ఒకరి తర్వాత మరొకరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారే హుస్నాబాద్ పట్టణానికి చెందిన రాజ్‌కుమార్, శ్వేత, శ్రీకాంత్. తండ్రి హమాలీ కార్మికుడిగా పడిన కష్టానికి న్యాయం చేకూర్చారు. పట్టణ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.**



ప్రభుత్వ కొలువులు రాజ్‌కుమార్, శ్వేత, శ్రీకాంత్

**హుస్నాబాద్:** పట్టణానికి చెందిన చేర్యాల మైసయ్య, స్వరూప దంపతులు. వీరికి రాజ్‌కుమార్, శ్వేత, శ్రీకాంత్ సంతానం. పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. కూతురు శ్వేత గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుంది. చిన్న కుమారుడు శ్రీకాంత్ నెల రోజుల క్రితం ఫైర్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. కాల్ లెటర్ రాగానే జూలైలో ఫైర్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందనున్నాడు. తండ్రి మైసయ్య రోజువారి హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటిని చక్కదిద్దుకుంటూనే సంతానాన్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. భవిష్యత్‌లో తన పిల్లలు ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. కష్టాన్ని పంటి కింద భరిస్తూనే కూలీ పనులు చేస్తూ పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించారు. అనంతరం ఉద్యోగులు సాధించాలని భావించాడు. తండ్రి కష్టాన్ని చూసిన వారు కూడా ఆయన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇప్పుడు ఆ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు.

## దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ఏడుగురికి గాయాలు
- బాధితులంతా మెదక్ జిల్లా వాసులు

**మిర్యాలగూడ అర్బన్:** దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్ బైపాస్ వద్ద ఆదివారం జరిగింది. టూటౌన్ ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన మెగావత్ భోజ్యా తన కుటుంబ సభ్యులతో కలిసి టాటా ఏస్ వాహనంలో దామరచర్ల మండలం కల్లేపల్లిలో గల మైసమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. మొక్కులు చెల్లించుకుని ఆదివారం తిరిగి వెళ్తుండగా.. నందిపహాడ్ బైపాస్ క్రాసింగ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో వాహనం స్లో అయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన కంటైనర్.. వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మెగావత్ భోజ్యా, పూర్ణ, చరణ్, అనూషతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## రెండు బైక్‌లను ఢీకొన్న టాటాఏస్

**ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు**

**తూప్రాన్:** అతివేగంగా వచ్చిన టాటా ఏస్.. రెండు బైకులను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని యావపూర్ గ్రామ సమీపంలో తూప్రాన్-గజ్వేల్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన కర్రె నర్సింహులు(44), మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన పోచయ్య ఇద్దరు కలిసి బైక్‌పై తూప్రాన్‌కు వచ్చి తిరిగి అనంతగిరిపల్లికి వెళ్తున్నారు. వ్యతిరేక దిశలో గజ్వేల్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన టాటా ఏస్ వీరి బైక్‌తో పాటు వెనకాల వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. దీంతో రెండు వాహనాలపై ఉన్న నర్సింహులు, పోచయ్య, మోహన్, సతీష్‌లకు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అందులో నర్సింహులు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

# అద్దెలు పిరం

**పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సదాశివపేటలో ఇళ్ల అద్దె ధరలు సామాన్యులను హడలెత్తిస్తున్నాయి. ఒకప్పుడు సాధారణంగా ఉన్న ధరలు భారీగా పెరిగాయి. వాణిజ్య సముదాలయాల కిరాయిలు సరేసరి. కాగా, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడి వలసలు రావడం కూడా ఒకింత కారణమని చెప్పొచ్చు.**





- సదాశివపేటలో పెరిగిన ఇళ్ల కిరాయిలు
- ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వలసలు
- పారిశ్రామిక ప్రాంతం కావడం కూడా ఒక కారణం

**సదాశివపేట(సంగారెడ్డి):** సదాశివపేట పట్టణం ప్రస్తుతం పారిశ్రామికం ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. మండల పరిధిలోని ఎంఆర్ఎఫ్, పెన్నార్, గాయత్రి స్టార్‌కెమ్, ఎవరెస్ట్, ఎస్ఎస్ఆర్గానిక్స్, భాగ్యనగర్‌పైపుల పరిశ్రమలు ఇప్పటికే ఉన్నాయి. దీంతోపాటు కొత్తగా పలురకాల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పుడి ప్రాంతానికి తెలుగు రాష్ట్రాల ప్రజలు, స్థానికులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పరిశ్రమల్లో పనిచేసేందుకు జనాలు వస్తున్నారు. పదివేల మంది కార్మికులు ఆయా పరిశ్రమల్లో ఇప్పటికే పనిచేస్తూ సదాశివపేట మున్సిపల్ పరిధిలోని 26 వార్డుల్లో అద్దెఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. దీంతో పట్టణంలోని ఎవరెస్ట్, సదాశివ ఎన్‌క్లేవ్, గురునగర్, రాఘవేంద్ర నగర్, శ్రీరాంనగర్, దత్తాత్రేయనగర్, హనుమాన్‌నగర్, గణేష్‌కట్ట, ముర్తుజ్‌దర్గా, ఫయాజ్‌నగర్, సాయి నగర్, రహమత్‌నగర్, శంభులింగేశ్వరనగర్, ప్రియదర్శిని కాలనీ, ఎడ్లబజార్, గొల్లకేరి, శ్రీరామమందిరం, ప్రభుమందిరం, గాంధీరోడ్డు, పట్లలకేరిల్లో అద్దె ఇళ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సింగిల్ బెడ్ రూం రూ. 4 నుంచి 5 వేలు.. డబుల్ బెడ్‌రూం రూ.8 వేల నుంచి పది వేల వరకు యజమానులు అద్దె చెబుతున్నారు. పెంట్ హౌస్ అయితే రూ. 3 నుంచి 4 వేల వరకు కిరాయి ఉంది. 3-4 ఏళ్ల క్రితం పట్టణంలో అద్దెలు డబుల్ బెడ్రూం రూ. 3 వేల నుంచి 4 వేలు, సింగిల్ బెడ్రూం రూ. 2 నుంచి 3 వేలు ఉంది. కాలగమనంలో పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న రీత్యా యజమానులు పోటీ పడి మరి అద్దె ధరలను పెంచుకుంటూ పోతున్నారు. అడిగితే ఇంటి కుళాయి, ఇంటి పన్ను, భవన నిర్మాణ వ్యయం భారీగా పెరిగాయని పేర్కొంటున్నారు. దీంతో పేద మధ్య తరగతి ప్రజలు వారు చెబుతున్న అద్దె ధరలకు కంగుతింటున్నారు.

#### వాణిజ్య సముదాయాలదీ అదే పరిస్థితి..

పట్టణంలోని ప్రధాన రహదారి శాస్త్రిరోడ్డు, సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, గాంధీచౌక్, బుక్కకేరి, అంబేద్కర్ విగ్రహం నుంచి అయ్యప్ప మందిరం వరకు వాణిజ్య సముదాయాలున్నాయి. వాటి అద్దెలు ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. ప్రస్తుతం నెలకు అద్దె రూ.10 వేల నుంచి 30 వరకు పెరిగింది. అడ్వాన్స్ రూ. 3 లక్షల నుంచి 10 లక్షల వరకు తీసుకుంటున్నారని వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఒక షాపు అద్దె నెలకు రూ. 5 వేల నుంచి 10 వేలు ఉంది. అడ్వాన్స్ లక్ష వరకు చెల్లించారు. ఇప్పటికైనా అద్దె ధరలపై నియంత్రణ విధించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

## యువకుడికి అండగా ఊరు



బాలుడికి ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

- అప్పుడు తల్లి.. ఇప్పుడు తండ్రి మృతితో ఒంటరివాడైన బాలుడు స్వామి
- అక్కున చేర్చుకున్న రాయవరం గ్రామస్తులు

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** ఐదేళ్ల వయసులో అమ్మ కన్నుమూసింది. ఇప్పటి వరకు తోడు నీడ అయిన నాన్న అనారోగ్యంతో మరణించడంతో బాలుడు ఒంటరివాడయ్యాడు. గ్రామస్తులే ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. విషయానికొస్తే.. కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన రామింద్ల లక్ష్మి, ఐలయ్య దంపతులు. వీరికి స్వామి ఒక్కడే సంతానం. గ్రామంలోనే ఐలయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. స్వామికి ఐదేళ్ల వయసున్నప్పుడు అమ్మ లక్ష్మి అకాల మరణంచెందింది. నాటి నుంచి కొడుకు ఆలనా పాలనా తండ్రి ఐలయ్య చూసుకుంటూ వస్తున్నాడు. స్వామి మిరుదొడ్డి మండలం అల్వాల్ గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు పూర్తి చేశారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. కాగా ఐలయ్య అనారోగ్యం బారిన పడి ఈనెల 15న చనిపోయాడు. దీంతో తల్లిదండ్రులు ఇద్దరూ లేకపోవడంతో ఒంటరివడయ్యాడు. అతడి బాధను అర్థం చేసుకున్న గ్రామస్తులు ఒక చేయి వేసి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఉండటానికి సొంత గూడు లేకపోవడం వల్ల వాటర్ ప్లాంట్ కోసం నిర్మించిన గదిని స్వామి ఉండేందుకు గ్రామస్తులు ఇచ్చారు.

గ్రామస్తుల ఆర్థిక సహాయం

బాలుడు స్వామి దీన పరిస్థితిని చూసి గ్రామస్తులు చలించిపోయి ఆదివారం అంతా కలిసి రూ. 24 వేలు ఆర్థిక అందజేశారు. గ్రామానికి చెందిన ఒక డ్రైవర్ రూ. 7,500 ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.కాగా, ప్రభుత్వం కూడా స్పందించి ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయంతో పాటు గూడు కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

### 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**ఇద్దరిపై కేసు నమోదు**

**జహీరాబాద్ టౌన్:** మండలం పరిధిలోని మాడ్గిచెక్ పోస్టు వద్ద ఆదివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం లారీని పట్టుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారి సాయి రవి కథనం ప్రకారం.. ఆంధ్ర గుంటూరు జిల్లాకు చెందిన పద్మజ రైస్ ట్రేడర్ యజమాని కమలపతి శ్రీనివాస్‌రావు వద్ద గుజరాత్.. జాంనగర్‌లోని మయూరి నగర్‌కు చెందిన మకవన్ గిరిధర్‌బాయి.. 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. లారీలో లోడ్ చేసుకుని గుజరాత్‌కు తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దులో గల మాడ్గి చెక్ పోస్టు వద్ద నిర్వహించిన తనఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడింది. 1,120 బస్తాల్లో 280 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. విలువ రూ.3.36 లక్షలు ఉంటుంది. గిరిధర్‌బాయి, శ్రీనివాస్ రావులపై కేసు నమోదు చేసినట్లు రవి వివరించారు. పట్టుకున్న బియ్యాన్ని కోహీర్ మండలంలోని దిగ్వాల్ ఏఎంసీ గోదాంలో నిల్వ ఉంచామన్నారు.

# సమ్మర్ .. 'బాల' సంస్కార్

- విలువలతో కూడిన విద్య
- ఆటపాటలు, స్వీయరక్షణపై శిక్షణ
- క్యాంపు నిర్వహిస్తున్న సరస్వతిశిశుమందిర్
- నేడు చివరి రోజు



కర్రసాము నేర్చుకుంటున్న విద్యార్థులు

**సమ్మర్‌లో బాల సంస్కార్ క్యాంప్‌లో సంస్కృతీ సంప్రదాయాలు, ఆటపాటలతో పాటు స్వీయరక్షణకు శిక్షణ తీసుకుంటున్నారు విద్యార్థులు. 'నవ జీవన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో భారతీయ సనాతన ధర్మం, ఆచారాలపై అవగాహన, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ధార్మిక, నైతిక విలువలను తెలుసుకుంటున్నారు. 21 రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరం నేటితో ముగియనుంది.**

**గజ్వేల్‌రూరల్:** వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. అప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశముందని చెబుతుంది గజ్వేల్ పట్టణంలోని శ్రీసరస్వతి విద్యా(శిశు)మందిర్. నవ జీవన్ ఫౌండేషన్ సహకారంతో బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఏప్రిల్ 29న ప్రారంభం కాగా.. ఈ నెల 20 వరకు.. అంటే 21 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. 5 నుంచి 15ఏళ్ల లోపు ఉన్న 80 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఈ శిబిరంలో విలువలతో కూడిన విద్య, ఆటపాటలు, స్వీయరక్షణపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. యోగాసనాలు, కర్రసాము, కరాటే, సంస్కృత అభ్యాసం, శ్లోక పఠనం, మానసిక చైతన్యం కోసం శాస్త్రీయ నృత్యం, సంగీతం, ఫ్లూట్, ప్రాణాయామం, సృజనాత్మకత పెంచేందుకు వేద గణితం, వివిధ రకాల ఆటలు, నీతి కథలు చెబుతున్నారు. అందమైన చేతిరాతతో పాటు భారతీయ వ్యాయామం, ఇంద్రజాలం(మ్యాజిక్), స్పోకెన్ ఇంగ్లిష్, సనాతన ధర్మం, ఆరోగ్యం, పారిశుధ్యం, సీపీఆర్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

#### ప్రయోజకులవుతారు




చదువుతో పాటు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. చెడు వ్యసనాలు అలవాటు కాకుండా పిల్లలను శారీరకంగా, ఆధ్యాత్మికంగా, ధార్మికంగా ఉత్తమ పౌరులుగా తీర్చిద్దేందుకు కృషి చేస్తున్నాం. చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించేలా శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించినపుడే ప్రయోజకులవుతారు.


– డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, సరస్వతి శిశుమందిర్ ప్రభంధకారిణి సభ్యుడు

# మట్టిని కొల్లగొడుతున్నారు!

- చెరువులు, అసైన్డ్ భూముల్లో మొరం అక్రమ తవ్వకాలు
- దిడిగి, శేఖాపూర్‌లో యథేచ్ఛగా రవాణా
- అడ్డుకుంటున్న ప్రజలు, రైతులకు బెదిరింపులు



చెరువులో జేసీబీతో తీస్తున్న మట్టి



హోతి(కె): శివారులోని ఇటుకబట్టీలో డంప్ చేసిన మట్టికుప్పలు

**జహీరాబాద్:** చెరువుల్లో, అసైన్డ్ భూముల్లో ఉన్న మట్టిని కొల్లగొడుతున్నారు అక్రమార్కులు. యథేచ్ఛగా అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారు. అడ్డు చెబుతున్న రైతులు, ప్రజలను అక్రమార్కులు బెదిరిస్తున్నారు. ఇటుకబట్టీలకు మొరంను అమ్మి లక్షలు సంపాదించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. దిడిగి, శేఖాపూర్‌లో ఉన్న చెరువుల్లో, అసైన్డ్ భూముల్లోని మట్టిని వందలాది టిప్పర్ల ద్వారా దర్జాగా తరలిస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న ఇటుక బట్టీలకు తోలుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని రైతులు, ప్రజలు విమర్శిస్తున్నారు. మొన్నటి వరకు అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటంతో గుట్టుచప్పుడు కాకుండా యథేచ్ఛగా తరలించారు. ప్రస్తుతం కూడా దందా కొనసాగుతుంది. మైనింగ్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో అధికార యంత్రాంగం వెంటనే స్పందించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

#### విచారించి చర్యలు : రవీందర్, తహసీల్దార్

అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే విషయమై మా దృష్టికి వచ్చింది. ఈ విషయమై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్ఐని ఆదేశించాం. మైనింగ్ అనుమతులు ఉన్నాయో లేవో విచారిస్తాం. ఆపై తదుపరి చర్యలు చేపడతాం. ఎక్కడైనా అక్రమంగా మట్టి నిల్వలు ఉన్నట్లు ప్రజలు సమాచారం ఇస్తే బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

## ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

**జహీరాబాద్ టౌన్:** ఏసు క్రీస్తు బోధనలు మానవాళికి అవసరమని కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్, అంతర్జాతీయ స్పీకర్ మక్బూల్ పేర్కొన్నారు. పట్టణంలోని అల్లీపూర్ గార్డెన్ నగర్‌లో మెథడిస్ట్ 94వ క్రైస్తవ ఉజ్జీవ సభల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రపంచానికి శాంతి, ప్రేమ పూర్వక జీవన మార్గాన్ని ఉపదేశించారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని కోరారు. అంతకు ముందు చంద్రశేఖర్ రెవరెండ్ జేబీ గార్డెన్, ఎల్సి గార్డెన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్. సంజీవ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు నరోత్తం, సరీన్ జాన్, సెక్రటరీ రవి కుమార్, నిర్వాహకులు విద్యాసాగర్, నవీన్‌కుమార్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఉజ్జీవ సభల జాతర సందర్భంగా వక్తలు దైవ ఆరాధనసందేశం ఇచ్చారు. రోగులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించారు. జాతరను తిలకించడానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.